క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీఎల్‌ఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు ఏదైనా వ్యాధి సోకితే నయం చేయడానికి అందుబాటులో ఉండాలన్నారు. అలా కాకుండ విధులకు డుమ్మా కొడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఊటుకూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న స్పెషలాఫీసర్ ప్రసాద్

పరిగి: కాలానుగుణంగా ప్రజలకు సోకే వివిధ సీజనల్ వ్యాధుల పట్ల వైద్యారోగ్యశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు సత్వర వైద్య సదుపాయాలను కల్పించాలని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం అక్కడ పీహెచ్‌సీలో ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై స్థానిక మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ రవి, డాక్టర్ రూబీతో ఆరా తీశారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ


బాలురలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మడకశిర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫుట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. స్పెయిన్ దేశానికి చెందిన ఈగల్ ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు ఆటలో మెళకువలు నేర్పారు. ఫుట్‌బాల్ క్లబ్ కో ఆర్డినేటర్ జాకబ్, సభ్యులు ఐనా, ఇలియానా, అలెక్స్, జార్జి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్


అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

రొద్దం: మండల పరిధిలోని పి.కొత్తపల్లి, పి.రొప్పాల గ్రామాల పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ వలీబాషా తెలిపారు. ట్రాక్టర్ యజమానులు పి.నరసింహమూర్తి, నంజుడ, సిద్దప్ప, మంజునాథ్, ఎస్ నరసింహమూర్తితో పాటు ట్రాక్టర్లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఒక్కో ట్రాక్టర్లపై రూ. లక్ష జరిమానా విధించే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ నాగమల్లేశ్వరి

అగళి: మండల పరిధిలోని మధూడి గోళహట్టి, కదిరేపల్లి, ఐ తోనసనపల్లి, అగళి–2 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ నాగమల్లేశ్వరి శుక్రవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్ల రికార్డులు పరిశీలించారు. అనంతరం అగళి–2 అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత ఆధార్ నమోదు కేంద్రాన్ని సందర్శించారు.

ర్యాపిట అధ్యక్షురాలిగా కళాబాయి

పావగడ: తాలూకాలోని ర్యాపిట గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా జేడీఎస్ పార్టీకి చెందిన కళాబాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గ్రామ పంచాయతీ మీటింగ్ హాలులో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఆమె ఒక్కరే నామినేషన్ పత్రం దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు.

సమస్యల తిష్ట

- చిలమత్తూరు పరిధిలో ట్రాన్స్‌కో ఏఈ లేక ఇక్కట్లు
- డీఈ, ఏడీ మధ్య కోల్డ్‌వార్
- రైతుల సమస్యలను పట్టించుకునేవారే కరువు



ఇటీవల 44వ జాతీయ రహదారిపై జువారి సిమెంట్స్ ఫ్యాక్టరీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం ,చిలమత్తూరులోని విద్యుత్‌శాఖ కార్యాలయం

చిలమత్తూరు: ట్రాన్స్‌కో ఏఈ లేకపోవడంతో మండలంలో విద్యుత్ సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఇన్‌చార్జ్ ఏఈ, ఏడీ మధ్య కోల్డ్‌వార్‌తో పనులు ముందుకు సాగడం లేదు.

ఇన్‌చార్జ్ ఏఈతో చిక్కులు

వ్యవసాయ నూతన విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సరఫరాలో సమస్యలు ఇలా మండల వ్యాప్తంగా అనేక సమస్యలు నెలకొన్నాయి. విద్యుత్ ఏఈ లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందని రైతులు వాపోతున్నారు. సమస్యలు రాకుండా ఉన్నతాధికారులు ఏడీ రంగయ్యకు ఇన్‌చార్జ్ ఏఈ బాధ్యతలు అప్పచెప్పారు. అయితే ఆయన అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు డీఈ భూపతి సూచించిన పనులు ఆయన చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వారిద్దరి మధ్య కోల్డ్ వార్ కారణంగా ఏ పనులు జరగడం లేదని అంటున్నారు. ఏడీ వ్యవహారం ఎస్ఈ దృష్టికి కూడా వెళ్లిందని ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

పెండింగ్‌లో పనులు

మండల వ్యాప్తంగా దాదాపు నూతన వ్యవసాయ కనెక్షన్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. దాదాపు సంవత్సరానికి పైగా 30 మందికి పైగా రైతులు ట్రాన్స్‌ఫార్మర్లకు దరఖాస్తు చేసికున్నారు. నేటికీ వారికి ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయడం లేదని అంటున్నారు. చాలామంది రైతులు నూతన బోరు కనెక్షన్‌ల కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా పట్టించుకున్న పరిస్థితులు లేవు. ఫోన్ ద్వారా అడుగుదామన్నా ఇన్‌చార్జ్ ఏఈ స్పందించే పరిస్థితులు లేవని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, అప్పులు చేసి బోరుబావులు తవ్విస్తే పంటలు పండించి అప్పులు తీర్చుకుందామనుకుంటే అధికారుల తీరుతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

సదరు విద్యుత్ ఏడీ రైతులకు మేలు చేయకపోగా, ఉన్నతాదికారులను సైతం లెక్కచేయడం లేదన్న ఆరోపణలున్నాయి. రైతుల సమస్యల విషయంలో ఈఈ మొదలు, ఎస్ఈ వరకూ ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రయోజనం లేదంటున్నారు. గతంలో ఏఈగా పనిచేసిన నారాయణస్వామి 8 నెలల క్రితం బదిలీ కాగా అప్పటి నుండి లేపాక్షి ఏఈని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించి అదనపు బాధ్యతలు ఇచ్చారు.అయితే ఆయన కూడా ఇక్కడ ఎక్కువ కాలం ఉండలేదు. దీంతో ఏడీ కే ఆ బాధ్యతలు ఇచ్చారు. అయితే ఆయన కూడా పనులు చేయకుండా తప్పించుకొని తిరుగుతుండటంతో అందరూ అవస్థలు పడుతున్నారు. రైతుల సమస్యలపై పరిష్కారంపై ఏడీ రంగయ్యను సాక్షి వివరణ కోరగా ఆయన ఉన్నతాధికారులపై నెట్టేయడం కొసమెరుపు. మరోవైపు ఉన్నతాధికారులను వివరణ కోరగా.. వారు ఏడీ తప్పిదంగా చెబుతుండటం గమనార్హం.

జోరుగా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు

మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు తరచూ జరుగుతున్నాయి. కిందిస్థాయి ఉద్యోగులు ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా విచారణ చేసి తర్వాత పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. టేకులోడు, దేమకేతేపల్లి, చిలమత్తూరు, 44 వ నంబరు జాతీయ రహదారి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించారు. మానిటరింగ్ అధికారి లేకపోవడంతోనే సమస్య వస్తోందని అర్థం అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చిలమత్తూరు మండల రైతుల సమస్యలపై దృష్టి సారించి నూతన ఏఈని నియమించాలని రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అవినీతి

రైతులకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారిని పక్కన పెట్టి ఎవరు డబ్బులు ఎక్కువగా ఇస్తే వారికి ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేస్తున్నారని అంటున్నారు. దీనిపై కూడా విచారణ జరిపి సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదు



అప్పులు చేసి బోరు బావి తవ్వించాను. విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ కార్యాలయానికి పలుమార్లు తిరిగాను. ఏఈ లేకపోవడంతో తెలిసిన వాళ్ల ద్వారా ఏదోలా రూ.30 వేలు డీడీ కట్టి దరఖాస్తు చేశాను. నెలలు గడుస్తున్నా నాకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. వాళ్లు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఉంటే ఈ పాటికి పంట చేతికందేది. ఆర్థిక పరిస్థితులు బాలేని నాలాంటి రైతులకు ఇలా అధికారులు అన్యాయం చేస్తే ఎలా? ఇప్పటికైనా నాకు విద్యుత్ కనెక్షన్ వెంటనే అందించాలి.

– శంకర్‌రెడ్డి, రైతు, మరవకొత్తపల్లి

ఆధార్ సెంటర్ తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను శుక్రవారం మధ్యాహ్నం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఆధార్ అప్‌డేట్స్ వివరాలపై నిర్వహకుడు రవితో అడిగి తెలుసుకున్నారు.

మారెమ్మ గుడిలో చోరీ

పెనుకొండ: మండల పరిధిలోని వెంకటాపురం తండాలో ఉన్న మారెమ్మగుడిలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. ఆలయ తలుపులు ధ్వంసం చేసి గుడిలో హుండీ, బీరువాలోని నగదును దోచుకెళ్లారు. అలాగే అమ్మవారికి ఉన్న నగలను సైతం ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

డ్రగ్స్‌తో జీవితాలు బుగ్గి


మాట్లాడుతూ సెబ్ ఏఎస్పీ సుబ్రమణ్యం

హిందూపురం: డ్రగ్స్ వల్ల జీవితాలు బుగ్గిపాలవుతాయని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సెబ్ ఏఎస్పీసుబ్రమణ్యం అన్నారు. యువత చెడు వ్యాసనాలు, ప్రవర్తనపై వైపు కాకుండా ఉన్నతస్థాయిలో నిలవాలనే లక్ష్యంగా చదవాలన్నారు. శుక్రవారం బాలాజీ డిగ్రీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వీరభద్రప్ప అధ్యక్షతన యాంటీ డ్రగ్ డే నిర్వహించారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ జీవన, జెవీవీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలైన వారు ఒకసారి వారి జీవితాలు, వారిపై ఆధారపడిన కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐరాజశేఖర్, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగం స్ఫూర్తిదాయకం

హిందూపురం టౌన్/పరిగి/మడకశిర/పావగడ: దేశం కోసం దాయాది దేశం పాకిస్తాన్‌తో కార్గిల్ యుద్ధం చేసి అమరులైన భారతీయ సైనికుల త్యాగం స్ఫూర్తిదాయకమని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల కొడిగెనహళ్లి ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు అన్నారు. శుక్రవారం కార్గిల్ దివస్ సేవామందిరం కూడలిలో భగత్ సింగ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు.

- హిందూపురంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి అధ్యక్షత వహించగా, అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి, సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ శివ రాయల్‌లు పాల్గొని మాట్లాడారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తవుతోందని, సైనికులు పోరాటం చిరస్మరణీయం అన్నారు.
- పావగడ తాలూకాలోని మంగళవాడలో అంత్యోదయ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కార్గిల్ అమర వీరుల చిత్ర పటాలను ప్రదర్శించారు. అనంతరం 101 కొవ్వొత్తులను వెలిగించి అమర వీరులకు గౌరవ వందనం సమర్పించారు.
- మడకశిర పట్టణంలో బీజేపీ కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మడకశిర మండలంలోని పాపసానిపల్లికి చెందిన మాజీ సైనికుడు నంజిరెడ్డిని సన్మానించారు.


పరిగిలోని సేవా మందిరం కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు


మడకశిర: కార్గిల్ వీరుడు నంజిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

మడకశిరరూరల్: ప్రకృతి వ్యసాయం ద్వారా పంటల సాగు రైతుకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు అధికారి లక్ష్మానాయక్ తెలిపారు. ఆయన శుక్రవారం ఆమిదాలగొందిలో మహిళా రైతులు లీలావతి, ఓంకారమ్మ బీడు భూముల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసే రైతుకు వచ్చే ఆదాయాన్ని వివరించారు.

సేంద్రియ పద్ధతితో లాభాలు

అగళి: మండల పరిధిలోని ఇనగలూర్, తోనసనపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు అధికారి లక్ష్మన్న నాయక్ సందర్శించారు. పలు పంటలపై ఆకు ముడత పురుగు ఆశించినట్లుగా గుర్తించారు. రైతులు రసాయనిక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతి ద్వారా అతితక్కువ ఖర్చుతో పంటలను సాగు చేసి లాభాలు గడించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్‌నాయక్, పవన్, ప్రకృతి వ్యవసాయ క్షేత్రసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అగళి: పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లక్ష్మన్ననాయక్

విద్యార్థులతో స్నేహంగా మెలగాలి : డీఈఓ

హిందూపురం టౌన్: విద్యార్థులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు డీఈఓ మీనాక్షి సూచించారు. శుక్రవారం హిందూపురంలోని ఎంజీఎం పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేసి, మాట్లాడారు. శిక్షణను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో అనుసరించాలన్నారు. తరగతి గదిలో సానుకూల పరిస్థితులు నెలకొనేలా చేసి విద్యార్థులు తమ భావనలను వ్యక్తపరిచేలా చూడాలన్నారు. విద్యార్థుల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా బోధనాతీరు ఉండాలన్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి బోధన తీరు మారాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ గంగప్ప, ఎంఈఓ మహేందర్ రెడ్డి, అబ్జర్వర్ అబ్రహం, ఆర్పీలు రాజు, ఓబులేసు, ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

మందుల పిచికారీతో కత్తెర పురుగుకు చెక్


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

చిలమత్తూరు: మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించుకోవడానికి రైతులు దశల వారీగా మందులను పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని కోడూరు గ్రామ పొలాల్లో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఎక్కువుగా ఆశించడంతో పురుగు నివారణకు ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఏడీఏ అల్తాఫ్‌ఖాన్, ఏఓ వంశీకృష్ణ, ఏఈఓ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి 'కియా' కృషి


గుట్టూరులో సోలార్ విద్యుత్ లైట్లను ప్రారంభిస్తున్న కియా ప్రతినిధులు

పెనుకొండ రూరల్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కియా పరిశ్రమ కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే శుక్రవారం గుట్టూరులోని జెడ్పీ హైస్కూల్‌లో డైనింగ్‌హాల్ నిర్మాణానికి ఆ సంస్థ ప్రతినిధులు భూమి పూజ చేశారు. గుట్టూరు, ఎర్రమంచి, అమ్మవారిపల్లి, మునిమడుగు, దుద్దేబండ, చిన్నపరెడ్డిపల్లి, పెనుకొండ గ్రామాల్లో ఒక్కో గ్రామానికి 50 సోలార్ లైట్లు అమరుస్తున్నట్లు కియా ప్రతినిధులు తెలిపారు. పెనుకొండ, కొత్తచెరువు మండలాల్లో 300 మందికి కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

రొళ్ల: గ్రామీణా ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. తొలుత రక్త పరీక్ష, కాన్పు గదితో పాటు అత్యవసర చికిత్స కేంద్రం తదితర గదులను పర్యవేక్షించి ఓపీ వివరాలు, మందుల వివరాలపై ఆరా తీశారు. డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి మాట్లాడుతు వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఆరోగ్య, ఆశ వర్కర్లతో పాటు హెల్త్ అసిస్టెంట్లు గ్రామాల్లో వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ సృజన మాట్లాడుతూ ఆస్పత్రిలో 30 పడగలకు కేవలం 10 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఆర్‌ఓ ప్లాంట్ లేక రోగులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని డీఎల్‌పీఓ హామీ ఇచ్చారు.


ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లికి చెందిన చిన్నగంగమ్మ (63) బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 22న గొల్లపల్లి సమీపంలో కుమారుడు రాజుతో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చీర ద్విచక్ర వాహనంలో చిక్కుకొని కిందపడిపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగానే చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. చిన్నగంగమ్మ అల్లుడు హనుమంతప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలతో పాటూ కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలని వినతి

మడకశిర: నియోజకవర్గంలోని అమరాపురం కేంద్రంగా వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు అమరావతిలో రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడుని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మల్బరీ షెడ్లపై సబ్సిడీని పెంచాలని, బైవోల్టిన్ రైతులకు ప్రోత్సాహకాన్ని అందించాలన్నారు. రాష్ట్ర హోంమంత్రి అనితను కూడా కలిసి మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐని నియమించాలని కోరారు.

విజయోత్సవ ఆహ్వాన పత్రికల విడుదల

అమరాపురం: స్థానిక వైద్య ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే మెగా ఉచిత ఆరోగ్య శిబిరం 200 క్యాంపు సందర్భంగా విజయోత్సవ వేడుకలు , సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అమరాపురం ఆరోగ్య మైత్రి కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, శ్రీనివాసమూర్తి, రమేష్‌బాబు, పద్మరాజ్‌జైన్ తెలిపారు. ఉచిత వైద్య శిబిరాల్లో సేవలందిస్తున్న వైద్యులను సన్మానిస్తామన్నారు. అనంతరం ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు.

నిధులు కేటాయించండి


మాట్లాడుతున్న వైద్యుడు ఓంకార్

సోమందేపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు అంజినాయక్, కిష్టప్ప, జిలాన్‌ఖాన్ మాట్లాడుతూ 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బకాయిపడ్డ విద్యుత్ బకాయిలను కూడా ఆర్థిక సంఘం నిధుల్లో తీసుకున్నారని, ఇప్పటికైనా గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యల తీసుకుంటామని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని గుట్టూరు ప్రభుత్వాస్పత్రిని స్పెషల్ ఆఫీసర్ పద్మావతి తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులు, గదులను పరిశీలించారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

లేపాక్షి: బాల్య వివాహాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలని హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మానేపల్లిలో జరిగిన సెక్టార్ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

క్రీడాకారిణికి అభినందన

మడకశిరరూరల్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలో మడకశిర మండలం కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పీ చందన మంచి ఆటతీరు ప్రదర్శించి జట్టు తృతీయస్థానంలో నిలవడంతో కీలకంగా వ్యవహరించినట్లు పీఈఓ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకూ జరిగిన సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో చందన ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. శుక్రవారం పాఠశాలలో చందనను హెచ్ఎం కృష్ణమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ పూజలు


శాకంబరిగా దర్శనమిస్తున్న చోళమాంబదేవి


రొళ్ల: ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


అలంకరణలో కన్యాకాపరమేశ్వరి


హిందూపురంలో శాకంబరిగా దర్శనమిస్తున్న వాసవీమాత

అమరాపురం: మండల కేంద్రంలో వివిధ ఆలయాల్లో శుక్రవారం ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యాకపరమేశ్వరి అమ్మవారిని వాయునాల అలంకరణలో అర్చకులు నరసింహభట్టాచార్యులు, హరీష్‌భట్టాచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే చోళమాంబదేవిని అర్చకుడు శ్రీనివాస్ శాకాంబరిగా అలంకరించడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వెంకటేశ్వరస్వామికి పూజలు

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. తొలుత శ్రీదేవి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి మూల విగ్రహాలకు అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, క్షీరాభిషేకం చేశారు. తర్వాత వెండి కవచాలతో పాటు పూలతో అలంకరణ చేసి స్వామివార్లకు మహామంగళారతి చేశారు. అలాగే రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

హిందూపురం: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం ఆషాఢమాసం పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరి అలంకరించగా భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.